## విదేశీ భాషల్లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: ఓయూ పరిధిలో వివిధ విదేశీ భాషల్లో డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో నాలుగు నెలల జూనియర్, సీనియర్ డిప్లొమా కోర్సులను అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు చివరి తేదీ డిసెంబర్ 2. కాగా తరగతులు నవంబర్ 30 నుంచే ప్రారంభమవుతాయని అన్నారు. తరగతులు రోజూ ఉదయం 7 నుంచి తొమ్మిది 9 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు జూనియర్ డిప్లొమాలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. సీనియర్ డిప్లొమాలో చేరేందుకు కనీసం యాభై శాతం మార్కులతో జూనియర్ డిప్లొమా కానీ, యూజీలో సంబంధిత భాషను సెకెండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలని చెప్పారు. దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు 83310 41309 నంబర్‌లో కానీ, ఆర్ట్స్ కళాశాలలోని విదేశీ భాషల విభాగం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## వివిధ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సులతో పాటు బీసీఏ ఆరో సెమిస్టర్ మేకప్ పరీక్ష ఫీజును ఈనెల 28వ తేదీ లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ, బీసీఏ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 4వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# ఆపదలో అండగా ఉంటా

### 20లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, అక్టోబర్ 18: ఆపదలో అండగా ఉంటానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 55 మందికి రూ.20లక్షల మేరకు విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కులను గురువారం అందించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు వైద్య సేవలను అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని అన్నారు. పేదలకు వెన్నుదన్నుగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, కంది శైలజ , సునీత, ప్రసన్నలక్ష్మి, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు తీగుల్ల రామేశ్వర్‌గౌడ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, తదితరులు

## ఎమ్మెల్యేను కలిసిన చిరు వ్యాపారులు



ఎమ్మెల్యే తలసానితో మాట్లాడుతున్న అమీర్‌పేట్, మైత్రివనం ఫుట్‌పాత్ వ్యాపారులు, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి

బేగంపేట్, అక్టోబర్ 18: ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ట్రాఫిక్ అధికారులను కోరారు. శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో కనకదుర్గ ఆలయం, మైత్రివనం ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారనే కారణంతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తమకు చిరు వ్యాపారాలే జీవనాధారం అని అవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకునే విధంగా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.





సికింద్రాబాద్ మోండా డివిజన్‌లోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయాన్ని శుక్రవారం మహిళా భక్తులు సందర్శించారు. ఈ సందర్భంగా సామూహిక సాక సమర్పించారు.

## సన్మానం

చిక్కడపల్లి, అక్టోబర్ 18: బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడిగా శంకర్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం భోలక్‌పూర్ డివిజన్ పార్టీ మీడియా ఇన్‌చార్జి వై.శ్రీనివాస్ శంకర్‌ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించారు.



## పెండింగ్ పనులను త్వరగా ప్రారంభించండి

అడ్డగుట్ట, అక్టోబర్ 18: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన ప్రారంభించాలని కోరుతూ అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శుక్రవారం జలమండలి జీఎం వినోద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. టెండర్ పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించాలని అన్నారు. డివిజన్‌లో ఆయా ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న పవర్‌బోర్లకు మరమ్మతు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు. జీఎంని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు లింగాని శ్రీనివాస్ ఉన్నారు.



జీఎం వినోద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

## ఉచిత వైద్య శిబిరం




వైద్య శిబిరంలో మందులను అందజేస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 18: జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్, బన్సీలాల్‌పేట్ సేవా సంఘం సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బన్సీలాల్‌పేట్ డి-క్లాస్‌లోని సంఘం హాలులో శుక్రవారం శిబిరాన్ని కార్పొరేటర్ కె.హేమలత ప్రారంభించారు. భారత్ వికాస్ పరిషత్ ద్వారా 95 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ప్రతినిధులు నర్సింహమూర్తి, వెంకటనారాయణ, నర్సింగ్‌రావు, భారత్ వికాస్ పరిషత్ కన్వీనర్ సదాశివరెడ్డి, సేవా సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, కార్యదర్శి రంగారావు, జగదీశ్, శ్రీనివాస్, కుమార్, రాజు, బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మిపతి, ఎస్సీఆర్పీఎస్ అధ్యక్షుడు సుదర్శన్‌బాబు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జన్మదినం



సుమన్ జన్మదినం సందర్భంగా మొక్కను నాటుతున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జన్మదిన వేడుకలను ఓయూలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కేక్ కట్ చేసి, మొక్కలు నాటారు. పలువురు మాట్లాడుతూ విద్యార్థి నాయకులను చట్టసభలకు పంపించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. భవిష్యత్తులో సుమన్ మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని అన్నారు. బీఆర్‌ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి

అడ్డగుట్ట, అక్టోబర్ 18: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను శుక్రవారం మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పలు ప్రాంతాల్లో రోడ్ల పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె జెడ్సీని కోరారు.




జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

## ప్రసన్నరాణికి జగన్నాథశర్మ స్మారక పురస్కారం



ప్రసన్నరాణికి పురస్కారాన్ని అందజేస్తున్న వేణుగోపాలాచారి

ముషీరాబాద్, అక్టోబర్ 18: నృత్య కిన్నెర సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వేదంతం జగన్నాథశర్మ 42వ వర్థంతి శక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరిగింది. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాలాచారి హాజరై ప్రముఖ కూచిపూడి నాట్య గురు ప్రసన్నరాణికి వేదాంతం జగన్నాథశర్మ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్త వోలేటి పార్వతీశం, బి.రాజగోపాల్‌రావు, కూచిపూడి నృత్యకారి ఓలేటి రంగమణి, మద్దాళి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో ప్లేస్‌మెంట్స్ డ్రైవ్




ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కంపెనీ ప్రతినిధులకు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించారు. సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎఫ్‌ఆర్‌డీ) భవనంలోని ఈ-క్లాస్ రూంలో నిర్వహించిన కార్యక్రమంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు రెటీనా పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని, కోఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్‌రెడ్డి, కంపెనీ హెచ్‌ఆర్ హెచ్.దేవి తదితరులు పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ మేఘ గర్జన సభ పోస్టర్ ఆవిష్కరణ



మేఘ గర్జన సభ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: పీడీఎస్‌యూ మేఘ గర్జన సభను ఈ నెల 21న నిర్వహించనున్నారు. సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. అరుణతార కామ్రేడ్ జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్‌లతో పాటు అనేకమంది ప్రగతిశీల విద్యార్థులు నూతన సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని పలువురు గుర్తుచేశారు. మేఘ గర్జన సభను వరంగల్‌లోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. సభకు విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సాంబ, గణేశ్, సుమన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ శ్మశాన వాటికల వద్ద ఏర్పాట్లు చేయాలి

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 18: నవంబర్ 2న జరిగే ఆల్ సోల్స్ డే కోసం క్రైస్తవ శ్మాశన వాటికల వద్ద తగిన ఏర్పాట్లను చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. శుక్రవారం ఆ పార్టీ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, గజ్జెల శ్రీను, వినోద్, సురేశ్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ ఇచ్చిన సిఫారసు లేఖను వారు ఆయనకు అందజేశారు.

## బీఈడీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: ఓయూ పరిధిలోని బీఈడీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, అక్టోబర్ 18: ఆజామాబాద్ డివిజన్ 11కేవీ డీడీకాలనీ, పటేల్‌నగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా శనివారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30గంటల వరకు డీడీకాలనీ ఫీడర్ పరిధిలోని డీడీకాలనీ ఎ అండ్ బి లైన్, రామచంద్రయ్య డిగ్రీ కాలేజ్, గ్లాస్కో, హిల్‌టన్ కెఫ్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు పటేల్‌నగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణనగర్, పటేల్‌నగర్, అబేద్కర్‌నగర్, ఆజానగర్, వడ్డెరబస్తీ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

## 22న మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాలు ప్రదానం

ముషీరాబాద్, అక్టోబర్ 18: సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రముఖులకు ఈనెల 22న మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాలను అందించనున్నట్టు సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, శృతిలయ చైర్మన్ బొక్కా భీమ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగరాయ గానసభలో జరుగనున్న కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త తదితరులు పాల్గొననున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# కల్లుగీత వృత్తిలో ఉపాధి పెంచే చర్యలు తీసుకోవాలి



సంఘం ఆల్బమ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిక్కడపల్లి, అక్టోబర్ 18: కల్లుగీత వృత్తిలో ఉపాధి పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం ఏర్పడి 67 ఏండ్లైన సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా ఉత్సాలను నిర్వహించారు. తెలంగాణలో పదేళ్ల ప్రయాణం కల్లుగీత వృత్తిలో ఉపాధి అంశంపై సదస్సును నిర్వహించారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, కల్లుగీత బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి, టాడీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ మాట్లాడారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు మాటూరి బాలరాజ్ గౌడ్, గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, సదానందంగౌడ్, వీరస్వామిగౌడ్, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములయ్యగౌడ్, భూపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బేగంపేట్, అక్టోబర్ 18: సికింద్రాబాద్ మోండామార్కెట్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలను ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగించారు. భారీ బందోబస్తు నడుమ బేగంపేట్ సర్కిల్ సిబ్బంది తొలగించారు. కొన్ని చోట్ల హాకర్స్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్డులోని బాటా చౌరస్తా నుంచి ఓల్డ్‌జైల్‌ఖాన, మోండామార్కెట్ స్ట్రీట్, పాతగాంధీ చౌరస్తా, పాలిక బజార్, అల్ఫా హోటల్ వరకు తొలిగించారు. స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ శంకర్రాజు, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ రోప్ స్పెషల్ డ్రైవ్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆపరేషన్ రోప్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డ్రైవ్‌లో భాగంగా పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. చిలకలగూడ నుంచి సీతాఫల్‌మండి వరకు ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన చిల్లర వ్యాపారులు, తోపుడు బళ్లను ఖాళీ చేయించి, ఆక్రమణలన్నింటినీ తొలగించారు. పాదచారులు, ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తున్న వారికి జరిమానా విధించారు.

## హస్తకళా వృత్తులను ప్రోత్సహించేందుకే ప్రదర్శనలు

కంటోన్మెంట్, అక్టోబర్ 18: హస్తకళా వృత్తుల వారికి ప్రోత్సాహాన్ని అందిస్తూ వారి ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా విక్రయించేందుకు పలు చోట్ల ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవి దేవకి తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నూతనంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన హస్తకళ కళాకారులను, వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్టు పేర్కొన్నారు. కేవలం హస్తకళలే కాకుండా వినోదభరితమైన కార్యక్రమాలతో పాటు, క్రీడలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దేశ వ్యాప్తంగా మెప్మా సంఘాలకు ప్రదర్శన మూలంగా ప్రోత్సాహం లభిస్తున్నట్టు తెలిపారు.

## మూసీ కాదు.. డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి

చిక్కడపల్లి, అక్టోబర్ 18: నగర డ్రైనేజీ సమస్యను పరిష్కరించకుండా మూసీ సుందరీకరణతో అభివృద్ధి జరగదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ముందుగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నారు. గాంధీనగర్ డివిజన్ ఆంధ్ర కేఫ్ సమీపంలో రూ.54.45 లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు శుక్రవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్ ఎ.పావనితో కలిసి ప్రారంభించారు. పెరుగుతున్న జనాభాకు అనుగునంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెప్పారు.వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఎంసీ ఖాదర్ మోహియుద్దీన్, ఏఎంఓహెచ్ ప్రవీణ, ఏఈ సలాం, ఎలక్ట్రిసిటీ ఏడీ ఏపీపీ సంపత్, ఏఈ సుధామ, ముషీరాబాద్ ఎంఆర్ఓ, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్, సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, పున్న సత్యనారాయణ, శ్రీకాంత్, గడ్డమీది శ్రీనివాస్, తుడుం రాజేందర్, కిరణ్, హనుమంతు, పద్మ, తుడుం లక్ష్మి, సుధా తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రికి అభ్యర్థుల విన్నపం

చిక్కడపల్లి, అక్టోబర్ 18: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని, జీఓ 29 రద్దు చేయించాలని కేంద్రమంతి కిషన్‌రెడ్డికి గ్రూప్స్ అభ్యర్థులు విన్నవించుకున్నారు. శుక్రవారం గాంధీనగర్‌లో సివరేజ్ పనులు ప్రారంభించడానికి కేంద్రమంత్రి హాజరయ్యారు. ఈ క్రమంలో తమను న్యాయం చేయాలని కోరారు. గ్రూప్స్ అభ్యర్థులు చేస్తున్న ఆందోళనకు బీజేవైఎం మద్దతు తెలిపింది.

## ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్లకు అభినందనలు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 18: రాష్ట్ర ఉన్నతవిద్యామండలి నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంను ఓయూ గెజిటెడ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు శుక్రవారం అభినందించారు. వారిని కలిసిన ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వర్సిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు డాక్టర్ కుమార్, డాక్టర్ బుచ్చయ్య, ఖదీర్ ఖాన్, నరేశ్ పాల్గొన్నారు.

## ఉన్మాదులకు అడ్డాగా నగరం

### ఎంపీ ఈటల రాజేందర్



మారేడ్‌పల్లి, అక్టోబర్ 18: హైదరాబాద్ ఉన్మాదుల ట్రైనింగ్‌కు అడ్డాగా మారిందనడానికి ఆలయంపై దాడి ఉదంతమే ఉదాహరణ అని మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయాన్ని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి ఎంపీ సందర్శించారు. అనంతరం ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆలయాలకు రక్షణ లేకుండా పోయిందని, ఆయా ప్రాంతాల్లో 5 ఆలయాలపై దాడులు జరిగాయని తెలిపారు. ఈ ఘటనలపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్మాదాన్ని ఏ మతం సహించదని, ఎవరి విశ్వాసాలకు తగ్గట్టుగా వారు ఉండాలని అన్నారు. ఇంతజరుగుతున్నా ఇంటెలిజెన్స్ పోలీస్ ఏం చేస్తుందని ప్రశ్నించారు. నగర పోలీసు కమిషనర్ విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘటన జరిగి ఇన్ని రోజులవుతున్నా ప్రజలకు భరోసా కల్పించే ప్రకటన ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, నరేశ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT: KARIMNAGAR**

**ARB.No. 38 of 2024**

**Between:-**

**M/s. Margadarsi Chit Fund Private Limited,** Ramagundam. **...Disputant**

**AND**

**MENDA RAJITHA & Others** **...Opponents**

**NOTICE**

To,

**O-5. YAMJALA KIRAN KUMAR REDDY, S/o. BHEEMA REDDY,** H.No. 2-2-131/142/2, Dharmareddy Nagar Colony, Machabollaram, Secunderabad.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money. In the past you have been issued summon, but you have failed to receive the same. The above Dispute is posted on **22-11-2024** for your appearance. On that day you have to appear in person at 10:30 am before The Deputy Registrar referred above. Other-wise the case will be decided ex-parte.

Sd/- **DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, KARIMNAGAR.**